సాక్షి సంగారెడ్డి

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



అదృశ్యమై.. చెరువులో శవమై

మూడు రోజుల క్రితం గురుకులం గోడదూకి వెళ్లిన నలుగురు విద్యార్థుల్లో ముగ్గురు అదే రోజు తిరిగి రాగా.. ఒకరు ఆదివారం చెరువులో శవమై తేలాడు. 8లో

అందరికీ నెగెటివ్




పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన కోవిడ్ ర్యాపిడ్ టెస్టుల్లో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అలాగే ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించలేదని పేర్కొన్నారు.



మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకొని ముస్లింలకు తోఫాలను అందజేశారు. 9లో



సోమవారం ఇఫ్తార్	మంగళవారం సహర్
సా.6:38	ఉ.4:33

న్యూస్‌రీల్

గురుకుల పరీక్ష ప్రశాంతం



పరీక్ష తీరును పరిశీలిస్తున్న ఆర్‌సీఓ భీమయ్య

కొండాపూర్(సంగారెడ్డి): తెలంగాణ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు సంబంధించి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగింది. విద్యార్థులు ఒక గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోగా, అరగంట ముందు నుంచి లోనికి అనుమతించారు. ఈ పరీక్షకు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 4,076 మంది విద్యార్థులకు గానూ 3,555 మంది హాజరైనట్లు మెదక్, సంగారెడ్డి ఆర్‌సీఓ భీమయ్య తెలిపారు. మెదక్‌లోని రెండు పరీక్ష కేంద్రాల్లో 867 మంది విద్యార్థులకు గానూ 740 మంది హాజరయ్యారు. సంగారెడ్డి జిల్లాలో 3,209 మంది విద్యార్థులకు 2,815 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఆర్‌సీఓ భీమయ్య ఇస్మాపూర్‌లోని బాలికల గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

జోగిపేట(అందోల్): మహిళలు వంటింట్లో జరిగే అగ్ని ప్రమాదాలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని జోగిపేట ఫైర్ స్టేషన్ అధికారి శ్రీనివాస్ గౌడ్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆదివారం బృందావన్ కాలనీలో వంటింటి అగ్ని ప్రమాదాలు, ఎలక్ట్రికల్ ప్రమాదాలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాద నివారణ చర్యలు తెలుసుకోవాలన్నారు. వేసవిలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈనెల 20 వరకు అగ్ని ప్రమాద వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమిందార్ వీరేశం, కానిస్టేబుళ్లు గణేష్, దిలీప్, అర్జున్, విఠల్, సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను పర్మనెంట్ చేయాలి

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్ రావు



సమావేశంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

కొండాపూర్(సంగారెడ్డి): శిక్షణ కాలం పూర్తి చేసుకున్న పంచాయతీ కార్యదర్శులను తక్షణమే పర్మనెంట్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని మల్కాపూర్ చౌరస్తా వద్ద గల ఫంక్షన్ హాలులో నిర్వహించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమావేశానికి హాజరై మాట్లాడారు. సాధారణంగా ఏ ప్రభుత్వ ఉద్యోగికైనా రెండు సంవత్సరాల ప్రొబెషనరీ పిరియడ్ ఉంటే జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మాత్రం నాలుగేళ్ల ప్రొబెషనరీ విధించారన్నారు. జేపీఎస్‌ల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించడమే కాకుండా పనిభారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఒత్తిడి తట్టుకోలేక చాలా మంది తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారని తెలిపారు. జేపీఎస్‌ను తక్షణమే పర్మనెంట్ చేయాలని, లేనిపక్షంలో ఈ నెల 28వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్, మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నీరడి రాజు, ప్రధాన కార్యదర్శి నిషా, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

జైలుకు పోతాం.. అవకాశం కల్పించండి

- కరోనా తర్వాత మ్యూజియం జైలు మూత
- శిథిలావస్థకు చేరిన భవనం
- పునరుద్ధరించాలని కోరుతున్న పర్యాటకులు

సంగారెడ్డి టౌన్: జైలు.. ఈ పేరు వింటే అందరికీ గుర్తొచ్చేది ఖైదీలు. తెల్లని చొక్కా, దాని మీద నెంబరు.. తెల్ల నిక్కర్.. తెల్ల టోపీ. అయితే జైలు జీవితం ఎలా ఉంటుందో తెలుసుకోవాలనే వారికోసం తెలంగాణ ప్రభుత్వం 2016లో 'ఫీల్ ది జైల్' పేరుతో సంగారెడ్డిలో ప్రత్యేక కారాగారం ఏర్పాటు చేసింది. దేశంలోనే మొదటి మ్యూజియం, జైలు కూడా ఇదే.



సంగారెడ్డిలో మూతపడిన ఫీల్ ది జైల్

నిజాం కాలంలో..

నిజాం కాలంలో మొదట సంగారెడ్డి జైలు ఏరియాలో గుర్రపుశాల నిర్మించారు. ఆ తర్వాత బ్రిటీష్ ప్రభుత్వం అదే ఏరియాలో 1.5 ఎకరాల్లో జైలు ఏర్పాటు చేశారు. ఇందులో పదుల సంఖ్యలో బ్యారక్‌లు ఉన్నాయి. ఒక్కోదానికి తెలంగాణ, మొఘల్, నిజాం చరిత్ర, భారత స్వాతంత్ర్య ఉద్యమ సంఘటనల పెయింటింగ్ వేయించారు. బ్రిటీష్ కాలం నాటి ఫొటోలు కూడా గదుల్లో ఏర్పాటు చేయించారు. టైపు రైటర్లు, అప్పటి రేడియోలు, పెన్నులు, వాల్ క్లాక్ లు, గంటలు.. ఇలా ప్రతీ వస్తువు ప్రదర్శన కోసం ఉంచారు.

జైలు జీవితం అనుభవించాలనుకునే వారికి..

జైలు మ్యూజియమే కాదు.. జైలు జీవితాన్ని అనుభవించాలనుకునేవారికి అధికారులు సంగారెడ్డి జైలులో అవకాశం కల్పించారు. ఇందుకోసం రోజుకు రూ. 500 చెల్లించాలి. వారికి సాధారణ ఖైదీలాగే ఖాదీ దుస్తులు, చొక్కా, నిక్కర్ లేదా ప్యాంట్, ప్లేట్, గ్లాస్, మగ్గు, సబ్బు, మంచి భోజనం, నిద్రించేందుకు దుప్పట్లు తదితర సౌకర్యాలు కల్పించారు. టీ, టిఫిన్ ఇచ్చేవారు. యోగా, క్రమశిక్షణ నేర్పించారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లాకప్‌లో ఉంచేవారు. గతంలో ఇక్కడ సినిమా షూటింగ్‌లు కూడా జరిగేవి. జాతిరత్నాలు సినిమాతో పాటు ఇతర సినిమాల్లో జైళ్ల సీన్ల షూటింగ్ కూడా ఇక్కడే జరిగాయి.



పాత జైల్ మ్యూజియంలో గంటను మోగిస్తున్న కేరళకు చెందిన బాబీ చెమ్మనూర్(ఫైల్)



జైలులో మలేషియా వాసులు(ఫైల్)

ఉదయం 6.30 నుంచే..

ఉదయం 6.30 గంటల నుంచి వ్యాయామం, యోగా శిక్షణ ఉండేది. 7.30 గంటలకు టీతో పాటు టిఫిన్, తర్వాత పరేడ్ 8 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యాదానం ఉండేది. 9.30 గంటలకు మ్యూజియం సూపర్‌వైజర్ రౌండ్‌కు వచ్చేవారు. ఉదయం 10:30 నుంచి 11:00 గంటల వరకు మధ్యాహ్న భోజనం వడ్డించేవారు. 11 గంటల నుంచి తిరిగి విద్యాదానం కొనసాగేది. మధ్యాహ్నం 12.30 గంటలకు టీ, 12.35 నుంచి 1.30 గంటల వరకు విశ్రాంతి. 1.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కంప్యూటర్ విద్య, ఇతర అంశాలపై అవగాహన కల్పించేవారు. సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు యోగా, 4.30 గంటల నుంచి బ్యారక్‌ను శుభ్రం చేయడం వంటి ట్రైనింగ్ ఉండేది. సాయంత్రం 5.30 గంటలకు భోజనం ముగిసిన తర్వాత 6 గంటలకు లాకప్‌లో ఉంచేవారు. ఇలా ఇక్కడ సుమారు 50 మంది వరకు జైలు జీవితం కూడా గడిపారు. ఇదంతా గతం. కరోనా ఎఫెక్ట్‌తో జైలు మూతబడింది. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరింది. భారీ వర్షాలకు కాంపౌండ్ వాల్ పడిపోయింది. ప్రభుత్వం స్పందించి ఫీల్ ది జైల్‌ను పునరుద్ధరించాలని పర్యాటకులు కోరుతున్నారు.

ఫీల్ ది జైల్ ప్రారంభించాలి



శిథిలమైన ఫీల్ ది జైల్‌కు రిపేర్ చేయించాలి. పర్యాటకశాఖ స్పందించి చర్యలు తీసుకోవాలి. జైలు జీవితం అనుభవించాలనుకునే వారికి అవకాశం కల్పించాలి. ఈతరం వారికి జైలు అంటే ఎలా ఉంటుందో తెలియజేయాలి.

–అఖిల్ యాదవ్, సంగారెడ్డి

ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలి



సంగారెడ్డిలోని మ్యూజియం జైలును పునరుద్ధరించేందుకు ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలి. జైలు జీవితంపై యువతకు అవగాహన కల్పించాలి. చెడు మార్గంలో నడవకుండా, నిజజీవితంలో జైలు జీవితమంటే ఎంత నరకమో తెలియజేయాలి.

–కూన వేణు, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని జూకల్‌లో ఆదివారం రూ.20లక్షల ఎస్డీఎఫ్, రూ.5లక్షల ఉపాధిహామీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రహదారుల నిర్మాణంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, అందుకే రోడ్ల నిర్మాణానికి తగిన ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, నాయకులు రమేశ్‌చౌహాన్, లక్ష్మణ్‌రావు, దత్తురావు, సాయిలు తదితరులు పాల్గొన్నారు. ఖేడ్ మండలం దుబ్బతండాలో నిర్మించనున్న సేవాలాల్ మహారాజ్, భవానీమాత ఆలయాలకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం భోగ్‌భండార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. శివార్‌సందుతండా దక్షిణకాళీకామాత ఆలయ పీఠాధిపతి జగదీశ్వరానంద్ మహారాజ్ పాల్గొన్నారు. ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట్‌లో పోతలింగరాజు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయసమ్మేళనంలో పాల్గొన్నారు. గ్రామంలో ముదిరాజ్ భవన్ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ విఠల్, ఎంపీటీసీ భూపాల్, నాయకులు సాయిరెడ్డి, పోచయ్య, సత్యం పాల్గొన్నారు.

పరిశ్రమ పనులను అడ్డుకుంటాం

పదో రోజుకు చేరిన వడ్డేపల్లి గ్రామస్తుల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు, నాయకులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామ శివారులో కాలుష్యకారక పరిశ్రమ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని, లేనియెడల అడ్డుకొని తీరుతామని పరిసర గ్రామాల ప్రజలు హెచ్చరించారు. వడ్డేపల్లి గ్రామ శివారులో రసాయన పరిశ్రమ పనులను నిలిపివేయాలని చేపట్టిన ఆందోళన ఆదివారం పదో రోజుకు చేరుకుంది. ఈ నిరసనకు బీజేపీ నాయకులు సింగయ్యపల్లి గోపి, నర్సాపూర్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ వాలుదాస్ మల్లేశం గౌడ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగప్రభు గౌడ్, నవీన్, కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి గాలి అనిల్‌కుమార్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ పది రోజులుగా కాలుష్యకారక పరిశ్రమ పనులు నిలిపివేయాలని పరిసర గ్రామాల ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు ఆందోళన చేస్తున్నా అధికారులు పనులను ఎందుకు నిలిపివేయడం లేదని ప్రశ్నించారు. పరిసర ఆరు గ్రామాల ప్రజలకు ఇబ్బంది కలిగే ఈ పరిశ్రమ పనులను వెంటనే నిలిపివేయాలని, లేకుంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఆందోళన కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వరూప, ఉపసర్పంచ్ సురేశ్‌గౌడ్, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ రావు, నాయకులు రవి, దేవేందర్ రావు, కృష్ణ, ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): కార్యకర్తలతోనే పార్టీ బలోపేతమవుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జగ్గంపేట శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిలప్‌చెడ్ మరో ఉభయ గోదావరి జిల్లాల మాదిరిగా తయారవుతుందన్నారు. నియోజకవర్గంలో 14 చెక్ డ్యాం నిర్మాణాలు చేపడితే 11 పూర్తయ్యాయని తెలిపారు. త్వరలోనే నూతన ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిర్మిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ చైర్మన్ ఉమ్మన్నగారి దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రారెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఎంపీపీ వినోదరెడ్డి, వైస్ ఎంపీపీ విశ్వంభర, యూత్ నాయకుడు శశిధర్‌రెడ్డి, మండల రైతు సమన్వయకర్త రాజిరెడ్డి తదితరులున్నారు.

లింగాయత్‌లను ఓబీసీలో చేర్చేందుకు కృషి

ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సమాజంలో కులం, మతం, వర్ణం లింగ బేధాలు లేవని.. అందరూ ఒకటేనని 12వ శతాబ్దంలో విశ్వవ్యాప్తంగా చాటి చెప్పిన మహనీయుడు విశ్వగురు మహాత్మ బసవేశ్వరుడు అని ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం పట్టణంలోని బీరంగూడ చౌరస్తాలో ఎమ్మెల్యే సొంత నిధులు రూ.30లక్షలతో ఏర్పాటుచేసిన బసవేశ్వరుడి కాంస్య విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవేశ్వరుడి స్ఫూర్తితో సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. అదేవిధంగా లింగాయత్‌లను ఓబీసీలో చేర్చేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తన సొంత నిధులతో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ బసవేశ్వరుడి జయంతిని అధికారంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. బీరంగూడ గుట్టపై వేయి గజాల స్థలాన్ని వీరశైవ లింగాయత్ కులస్తులకు కేటాయించి భవన నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర శాసనమండలి మాజీ ప్రొటెం చైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి, కార్పొరేటర్ పుష్పనగేశ్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ఉన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, తదితరులు

'బీజేపీ వైపు యువత చూపు'

నర్సాపూర్: యువత బీజేపీ వైపు చూస్తున్నారని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి అన్నారు. ఆదివారం హత్నూర మండలానికి చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలను విస్మరించారని ఆరోపించారు. తమ ఉద్యమాలకు భయపడి అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని మండిపడ్డారు. హత్నూర మండలంలో కాలుష్య కంపెనీకి వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేష్‌గౌడ్, హత్నూర మండల శాఖ అధ్యక్షుడు నాగప్రభుగౌడ్, నాయకులు శంకర్, నిఖిల్, చంద్రంగౌడ్, మనీగౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సింగాయిపల్లి గోపి

'సీపీఎస్'ను రద్దు చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి వరప్రసాద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ఆదివారం సంగారెడ్డిలోని ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు వ్యతిరేకంగా, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకొచ్చిన సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ అనేది రాజకీయ పార్టీలు పెట్టే భిక్ష కాదని, ప్రభుత్వ ఉద్యోగి హక్కు అని పేర్కొన్నారు. 30 ఏళ్లుగా సేవ చేసే ఉద్యోగులను రిటైర్ట్ అయిన తర్వాత వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ కొనసాగిస్తామని హామీ ఇచ్చే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ర్యాలీకి టీపీటీఎఫ్, యూటీఎఫ్, పీఆర్‌టీయూ సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్ఈయూ నాయకులు శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీనివాస్, అంజనేయలు తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కేతకిలో ప్రత్యేక పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకి సంగమేశ్వర ఆలయంలో కర్ణాటక మాజీ మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఈశ్వర్ ఖండ్రే పూజలు చేశారు. ఆదివారం ఆలయానికి వచ్చిన ఆయన గర్భగుడిలోని పార్వతి పరమేశ్వరులకు అభిషేకం చేశారు. మహా మంగళ హారతి పూజ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయనను ఆలయ అర్చకులు, అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి సన్మానించారు. కర్ణాటక ఎన్నికల్లో భాగంగా సోమవారం ఎమ్మెల్యే స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు ఈశ్వర్ ఖండ్రే ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎన్.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మాజీ మంత్రి కుటుంబ సభ్యులు

'అసైన్డ్' అన్వేషణ!

- పట్టణ ప్రాంతాల్లో వెతుకులాట
- ఒక్కో మున్సిపాలిటీలో కనీసం 25 ఎకరాల చొప్పున ల్యాండ్ పూలింగ్
- తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పట్టణాల పరిధిలో అసైన్డ్ భూముల కోసం రెవెన్యూ యంత్రాంగం అన్వేషిస్తోంది. ఎక్కడైనా ఈ భూములు ఉన్నాయా అనే దానిపై అధికారులు వెతుకుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మాదిరిగానే మున్సిపాలిటీల పరిధిలో కూడా ల్యాండ్ పూలింగ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో మున్సిపాలిటీ పరిధిలో కనీసం 25 ఎకరాలైనా సేకరించాలని కలెక్టర్ శరత్ నుంచి ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, సంబంధిత మండలాల తహసీల్దార్లకు ఆదేశాలందాయి. ఈ మేరకు ఈ అసైన్డ్ భూములను గుర్తించే పనిలో పడ్డారు.

- సంబంధిత అసైనీల అంగీకారంతో ఈ భూములను సేకరిస్తారు. ఇందుకు ఒక్కో ఎకరానికి 600 గజాల చొప్పున స్థలాన్ని సంబంధిత అసైనీకి కేటాయిస్తారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో అసైన్డ్ భూములను ప్రభుత్వం సేకరిస్తోంది.
- ముఖ్యంగా నగరానికి సమీపంలో ఉన్న పటాన్‌చెరు ప్రాంతంలో పలు గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ మొదలైంది. ఇప్పుడు జిల్లాలోని అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ అందోల్, నారాయణఖేడ్ మున్సిపాలిటీల పరిధిలో ల్యాండ్ పూలింగ్ చేస్తున్నారు. అసైన్డ్ భూములను ల్యాండ్ పూలింగ్ చేసి, లేఅవుట్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ భూములను ప్లాట్లుగా మార్చి విక్రయించే యోచనలో ప్రభుత్వం ఉందని రెవెన్యూ అధికార యంత్రాంగం చెబుతోంది.



చాలా చోట్ల అన్యాక్రాంతం

జిల్లాలో అసైన్డ్ భూములు చాలా మట్టుకు చేతులు మారాయి. కేవలం వ్యవసాయం చేసుకొని జీవనం సాగించుకునేందుకే ప్రభుత్వం ఈ భూములను నిరుపేదలకు పంపిణీ చేసింది. పట్టణాలకు సమీపంలో ఉండటంతో ఈ భూములకు విలువ పెరిగింది. రోజురోజుకూ పెరుగుతున్న పట్టణీకరణతో ఈ భూములు చాలా చోట్ల చేతులు మారాయి. కొన్ని నివాస ప్రాంతాలుగా మారాయి. మరికొన్ని చోట్ల వాణిజ్య అవసరాలకు కూడా ఈ భూములను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో కూడా ల్యాండ్ పూలింగ్‌పై ప్రభుత్వం దృష్టి సారించడంతో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది.

భూములను గుర్తిస్తున్నాం

ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా పట్టణాల్లో కూడా అసైన్డ్ భూములను గుర్తించాలని వచ్చిన ఆదేశాల మేరకు ఈ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయనే దానిపై దృష్టి సారించాం. పట్టణాలను ఒక ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఈ ల్యాండ్ పూలింగ్ చేస్తోంది. అసైనీల అంగీకారంతోనే ఈ భూములను సేకరిస్తున్నాం. ఇందుకోసం వారికి ఒక్కో ఎకరానికి 600 గజాల స్థలాన్ని కేటాయిస్తామని చెప్పాం.

– మెంచు నగేశ్, సంగారెడ్డి ఆర్డీఓ

క్లుప్తంగా

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలను చూపుతున్న బాధితులు

మనోహరాబాద్(తూప్రాన్): కుక్కల దాడితో కొన్ని గొర్రెలు మృతి చెందగా, మరికొన్ని గాయపడ్డాయి. ఈ సంఘటన మండల కేంద్ర మైన మనోహరాబాద్‌లో ఆదివారం వేకువ జామున జరిగింది. స్థానికులు, వెటర్నరీ వైద్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంకు చెందిన నిమ్మల చిన్న మల్లేశ్‌కు చెందిన గొర్రెల దొడ్డిలో కుక్కలు జొరబడి దాడి చేయడంతో 20 గొర్రెలు మృతి చెందగా, పది గొర్రెలు గాయపడ్డాయి. గొర్రెల మృతితో రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపాడు. విషయం తెలుసుకున్న గొర్రెల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, ప్రజాప్రతినిధులు వెంకటేష్‌గౌడ్, సోములు, తదితరులు బాదిత బాధితుడిని పరామర్శించారు.

ఈత చెట్లను తగులబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



కాలిపోయిన ఈత చెట్లను పరిశీలిస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ సురేశ్

కొమురవెల్లి(సిద్దిపేట): గుర్తుతెలియని వ్యక్తులు ఈత చెట్లకు నిప్పంటించారు. ఈ ఘటన మండలంలోని గురువన్నపేట గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఈత చెట్లకు నిప్పంటుకున్న విషయం తెలుసుకున్న గీత కార్మికులు సంఘటన స్థలానికి వెళ్లి మంటలను ఆర్పివేశారు. అప్పటికే సుమారు 45 చెట్లు మంటల్లో పూర్తిగా కాలిపోయాయి. వెంటనే గ్రామ గీత కార్మికులు ఎక్సైజ్ సీఐ మహేందర్‌కు ఫోన్‌చేసి విషయం తెలిపారు. సీఐ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం చేర్యాల ఎక్సైజ్ ఎస్‌ఐ సురేశ్ సంఘటనా స్థలానికి చేరుకొని కాలిపోయిన ఈత చెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘటనపై విచారణ చేపడుతున్నామని ఉద్దేశపూర్వకంగా ఈత చెట్లను ఎవరైన తగలబెడితే వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు.

కాంగ్రెస్ నాయకుడిపై దాడి

పోలీసులకు ఫిర్యాదు, కేసు నమోదు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో నివాసం ఉంటున్న మద్దూరు మండల కాంగ్రెస్ నాయకుడు రాగుల శ్రీనివాస్‌రెడ్డిపై కొందరు దాడి చేసిన వీడియోలు ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దూరు ఎంపీపీ కృష్ణారెడ్డిపై సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ విషయమై జరిగిన చర్చే దాడికి కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు. బాధితుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎంపీపీ అభివృద్ధి చేయడం లేదని తాను ప్రశ్నించినందుకే దాడిచేశారని, అలాగే తన రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేక ఎంపీపీ తన అనుచరులైన బడుగు సాయిలు, ఎర్ర సాయి, కొందరు బీఆర్‌ఎస్ కార్యకర్తలచేత తనపై దాడి చేయించారని ఆరోపించారు. అధికార పార్టీ అండతో ఎంపీపీ తన అనుచరులను రెచ్చగొడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులపై దాడికి ఉసిగొల్పడం సిగ్గుచేటన్నారు. తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

అదృశ్యమై.. చెరువులో శవమై

- ఈత కోసం వెళ్లిన నలుగురు విద్యార్థులు
- చెరువులో మునిగి ఓ విద్యార్థి మృతి
- ఆందోళన చేసిన కుటుంబ సభ్యులు
- న్యాయం చేయాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న విద్యార్థి కుటుంబ సభ్యులు, బంధువులు మహేశ్ (ఫైల్)

నారాయణఖేడ్: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోని ఎస్టీ బాలుర గురుకులం విద్యార్థి అదృశ్యం కథ విషాదాంతమైంది. సదరు విద్యార్థి ఆదివారం చెరువులో శవమై తేలాడు. ఈ ఘటన ఆదివారం నారాయణఖేడ్‌లో జరిగింది. నారాయణఖేడ్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, ఎస్టీ గురుకులాల సంస్థ ఆర్సీఓ కల్యాణి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. న్యాల్‌కల్ మండలం గుంజెట్టికి చెందిన ఎరుకుల మహేశ్(17) గురుకులంలో 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం తోటి విద్యార్థులు అర్జున్, శివకుమార్, రజనీకాంత్‌తో కలిసి ప్రహరీ దూకి వెళ్లాడు. సమీపంలోని నష్లిమేట్ రామసముద్రం చెరువులో ఈతకోసం వెళ్లగా మహేష్ చెరువులో మునిగిపోవడంతో మిగతా విద్యార్థులు భయంతో గురుకులానికి వచ్చారు. మామిడికాయల కోసం వెళ్లగా అక్కడ తమకు మహేశ్‌తో గొడవ జరిగిందని, అక్కడి నుంచి మహేశ్ వెళ్లిపోయాడంటూ వెనక్కు వచ్చిన విద్యార్థులు ఉపాధ్యాయులకు తెలిపారు. శనివారం గురుకులం ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారించగా మహేశ్ గల్లంతైన విషయాన్ని తోటి విద్యార్థులు శనివారం సాయంత్రం తెలిపారు. అప్పటికే చీకటిపడటంతో ఆదివారం చెరువు వద్దకు వెళ్లి చూడగా మహేష్ మృతదేహం కనబడింది. గుంజెట్టికి చెందిన తుకారాం, రేణుక దంపతులకు మహేశ్(17), పవన్ (12), మహేశ్వరి (9) సంతానం. దంపతులు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కాగా మహేశ్ ఎస్టీ గురుకులంలో ఆరో తరగతిలో చేరాడు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతూ మృతి చెందాడు. మిగిలిన కుమారుడు, కూతురు న్యాల్‌కల్ మండలం హద్నూరులోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు.

మిన్నంటిన రోదనలు

మహేశ్ మృతిచెందిన విషయం తెలుసుకొని అతడి కుటుంబీకులు, బంధువులు పెద్ద ఎత్తున చెరువు వద్దకు చేరుకున్నారు. పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గురుకులం వద్ద డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. తమకు న్యాయం చేయాలంటూ మృతుడి కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. వీరికి బీజేపీ నాయకులు రజినీకాంత్, సాయిరాం కేవీపీఎస్, లంబాడా హక్కుల పోరాటసమితి, అంబేడ్కర్, పూలే సేవాసమితి నాయకులు కొటారి నర్సింహులు, ప్రకాష్ రాథోడ్, భీంసేన, ఇతర సంఘాల నాయకులు అంజాగౌడ్, జీవన్‌కుమార్ తదితరులు మద్దతు పలికారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఉన్నతాధికారులు వచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేయడంతో ఎస్టీ గురుకులాల ఆర్సీఓ కల్యాణి వచ్చి పోలీస్‌స్టేషన్‌లో మృతుడి కుటుంబీకులు, ఆయా పార్టీలు, సంఘాల నాయకులతో మాట్లాడారు. రూ.50 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, మూడెకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో అర్హులైన వారికి ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని, మిగిలిన డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామని తెలిపారని వివరించారు. అంత్యక్రియల నిమిత్తం స్టాఫ్ తరపున రూ.20వేల చెక్కును ఆర్సీఓ మృతుడి తల్లిదండ్రులకు అందజేశారు.

ముగ్గురు సస్పెన్షన్

గురుకులం నుంచి విద్యార్థులు బయటకు వెళ్లగా అందులో ఓ విద్యార్థి చెరువులో పడి మృతి చెందిన ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన గురుకులం పీడీ బాబులాల్, డ్యూటీ టీచర్లు లక్ష్మణ్, ఉదయ్‌లను సస్పెండ్ చేసినట్లు ఆర్సీఓ తెలిపారు.

సంప్రదాయాలు గౌరవించుకుంటూ..

- పండగలు జరుపుకుందాం
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతరెడ్డి



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి పండ్లు అందజేస్తున్న సునీతారెడ్డి

నర్సాపూర్: రాష్ట్రంలో ఒకరి సంస్కృతి, సంప్రదాయాలను మరొకరు గౌరవించుకుంటూ పండగలను జరుపుకుంటున్నామని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. రంజాన్ పండగను పురస్కరించుకుని ఆదివారం స్థానిక షాదీఖానాలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అల్లా దయ అందరిపై ఉండాలని ఆకాక్షించారు. దసరా, రంజాన్ తదితర పండుగలను కలిసి మెలిసి జరుపుకోవడం అభినందనీయమన్నారు. రంజాన్ పండగ దీక్షల ద్వారా వచ్చే పుణ్యాన్ని ఏడాది పాటు ఆచరణలో పెట్టుకుంటూ ముందుకు సాగడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి మాట్లాడుతూ పండగలను కలిసిమెలిసి జరుపుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

హాజరైన మాజీ క్రికెటర్ అజహారుద్దీన్, ఎమ్మెల్యే జగ్గారెడ్డి



ఇఫ్తార్‌విందులో క్రికెటర్ అజహారుద్దీన్, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి

జహీరాబాద్: జహీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈవిందుకు ప్రముఖులు హాజరయ్యారు. వారిలో టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ క్రికెటర్ అజహారుద్దీన్, సంగారెడ్డి ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి, మాజీ ఎంపీ సురేష్ శెట్కార్, జహీరాబాద్ ఎంపీపీ ఎస్.గిరిధర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాందాస్, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి, హన్మంత్‌రావు పాటిల్, కండెం నర్సింహులు, రామలింగారెడ్డి, మక్సూద్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చరిత్రను తిరగరాసింది

- ఆదర్శంగా ఇందిరానగర్ పాఠశాల
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటజోన్: ప్రభుత్వ పాఠశాల మీద ఉన్న అపనమ్మకం తొలగించి చరిత్రను సిద్దిపేట ఇందిరానగర్ పాఠశాల తిరగరాసిందని రాష్ట ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆదివారం విపంచి ఆడిటోరియంలో ఇష్టా ఆధ్వర్యంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ స్థాయి చదువును ప్రభుత్వ పాఠశాలల్లో అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లల్ని కూడా ఇదే పాఠశాలలో చదివించడం గొప్ప తనమన్నారు. ప్రవేశాలు లేవు అనే స్థాయికి ఇందిరానగర్ పాఠశాల చేరడం సంతోషంగా ఉందన్నారు. 200 విద్యార్థుల సంఖ్య నేడు వెయ్యికి చేరిందన్నారు. తన మిత్రుల ద్వారా యూనివర్సిటీ ద్వారా పాఠశాల దత్తత తీసుకొని దేశంలో ఒక కొత్త ప్రక్రియ చేపట్టారన్నా. భాష మీద పట్టు ఉంటే చాలా ముఖ్యమని, ఇంగ్లీషు లో ఒక పట్టు కోసం చేస్తున్న చిన్న ప్రయత్నం అని పేర్కొన్నారు. ఇద్దరు మనస్సుల మధ్య భాష మరింత ప్రయోజనాలకు దారి తీస్తుందని పేర్కొన్నారు. ఫారిన్ లాంగ్వేజ్ నేర్చుకోవడం వల్ల భవిష్యత్తు లో మంచి లబ్ధి చేకూరుతుందన్నారు. అనంతరం పలువురిని మంత్రి సన్మానించారు. అంతకుముందు పలువురు విద్యార్థులు ఫారిన్ లాంగ్వేజ్ లలో మాట్లాడి అలరించారు.

మెతుకు ఫౌండేషన్‌పై దుష్ప్రచారం తగదు

గజ్వేల్‌రూరల్: మెతుకు ఫౌండేషన్‌పై దుష్ప్రచారం చేయడం తగదని ఆ సంస్థ వ్యవస్థాపకుడు రవీందర్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సన్ పరివార్ సంస్థలో తాను ఒక ఉద్యోగిగా విధులు నిర్వహించానని, అవగాహన లేని కొంత మంది తాను సీఈవోగా భావిస్తూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. సన్ పరివార్ సంస్థ బాధ్యులను కోర్టులో హాజరు పరిచారని, వారిపై విచారణ జరుగుతున్నదని, తీర్పుకోసం వేచి ఉండాలన్నారు. ఇటీవల మాణిక్యం, ఉమారాణి దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం బాధాకరమని, సమస్య ఏదైనా ఉంటే ఓపికతో పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందులో తాను కూడా బాధితుడినేనని, కేసు కోర్టు పరిధిలో ఉన్నందున అవగాహన లేకుండా కొందరు సోషల్ మీడియా ద్వారా నిందారోపణలు చేయడం వల్ల బాధితుల ఆత్మహత్యాయత్నానికి కారకులవుతున్నారని ఆరోపించారు. ఈ ఘటనలతో తమకు ఎలాంటి సంబంధం లేదని, దుష్ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రంజాన్ మతసామరస్యానికి ప్రతీక

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో ముస్లింలకు ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హిందూముస్లింల మధ్య సోదర భావాన్ని పెంపొందించుటకు ఇఫ్తార్ విందులు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు మల్లం ఐలయ్య, నాయకులు హైమద్, సలీం పాల్గొన్నారు.

క్వారీలో మృతదేహం లభ్యం



రాములు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: చిన్న బండ క్వారీలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఆదివారం పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన వడ్డె రాములు వృత్తిరీత్యా ట్రాక్టర్ డ్రైవర్. రోజు మాదిరిగానే గీతం యూనివర్సిటీ వైపు వాకింగ్ కు 14వ తేదీ ఉదయం వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. అతడి కోసం వెతుకుతున్న క్రమంలో 15వ తేదీ ఉదయం రుద్రారం గ్రామానికి చెందిన భిక్షపతి తన గేదెలను మేపుతూ గ్రామ శివారులోని చిన్న బండ వైపు వెళ్లగా క్వారీలో రాములు మృతదేహం కనిపించింది. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు వేణుగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ షాపులకు పురుగు పట్టిన బియ్యం

తీసుకోవడానికి ఆసక్తి చూపని వినియోగదారులు



రామాయంపేట(మెదక్): మండల పరిధిలోని పలు రేషన్ దుకాణాలకు పురుగుపట్టిన దుర్వాసన వెదజల్లుతున్న రేషన్ బియ్యాన్ని సరఫరా చేశారు. దీంతో లబ్ధిదారులకు ఆసక్తి చూపడంలేదు. రామాయంపేట, దంతేపల్లి, పర్వతాపూర్, లక్ష్మాపూర్, తొనిగండ్ల, ఝాన్సిలింగాపూర్ గ్రామాల్లోని రేషన్ దుకాణాలకు పురుగు పట్టిన బియ్యం సరఫరా జరిగింది. ఈ విషయంపై డీలర్లు మాట్లాడుతూ తమకు పురుగుపట్టిన బియ్యాన్ని రామాయంపేట గోదాం నుంచి సరఫరాచేశారని ఆరోపించారు. వీటిని తీసుకోవడానికిగాను ఇష్టపడని వినియోగాదారులు తమతో గొడవపడుతున్నారని వారు వాపోయారు. నాణ్యమైన బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తూ పురుగుపట్టిన బియ్యాన్ని తమకు అంటగడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మంచం మీద నుంచి కింద పడి గాయపడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బెల్‌టౌన్‌షిప్‌లో ఆదివారం జరిగింది. బీహెచ్ఈఎల్ కాలనీలో నివాసం ఉండే అబ్దుల్‌ఘని(55) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. 15వ తేదీ తెల్లావారు జామున మంచం మీద నుంచి కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లావారు జామున మృతి చెందాడు.

పంటపై గడ్డిమందు చల్లారని రైతు ఆవేదన



రైతు నర్సింలు

వర్గల్(గజ్వేల్): గుర్తు తెలియని వ్యక్తులు చేతి కందుతున్న దశలోఉన్న మిరపపైరుపై గడ్డి మందు పిచికారీ చేసి నష్టపోయేలా చేశారని వర్గల్ మండలం తున్కిమక్త రైతు పసుల నర్సింలు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆదివారం ఆయన విలేకరులకు తన గోడు వెల్లబోసుకున్నాడు. తనకు మూడు ఎకరాల పొలం ఉందని, అర ఎకరంలో మిరప సాగుచేసినట్లు చెప్పారు. సాగు కోసం రూ.50 వేలు ఖర్చయిందని, కాత దశకు చేరిన తరుణంలో గుర్తు తెలియని వ్యక్తులు పైరుపై గడ్డిమందు పిచికారీ చేశారన్నారు. దీంతో చెట్లు వాలిపోయి, రంగు మారాయని ఆవేదన వ్యక్తం చేశాడు. దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందన్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

కార్టూన్‌ను మార్ఫింగ్ చేసి..

పేర్ చేశాడంటూ నోటీసు అందజేత

సిద్దిపేటకమాన్: కార్టూనిస్ట్ వేసిన ఫొటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేశాడంటూ ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి అతడికి పోలీసులు నోటీసులు అందజేశారు. సిద్దిపేట వన్ టౌన్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేటకు చెందిన కార్టూనిస్ట్ వెంకటరమణ రాష్ట ప్రభుత్వం అమలు పరిచే సంక్షేమ పథకాలు బేషుగ్గా ఉన్నాయంటూ ఒక కార్టున్‌ను గీసి మార్చి 27వ తేదీన సోషల్ మీడియా, ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. కాగా బీజేపీ నాయకుడు, ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్‌గౌడ్ ఆ కార్టున్‌ను మార్ఫింగ్ చేసి వాట్సాప్, ఫేస్‌బుక్, సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడని, తన అనుమతి లేకుండా తాను వేసిన కార్టున్‌ను మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో షేర్ చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వెంకటరమణ సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసిన వన్ టౌన్ పోలీసులు చక్రధర్ గౌడ్‌కు నోటీసు అందజేశారు.

అదుపుతప్పి కారు బోల్తా

కొల్చారం(నర్సాపూర్): అతివేగంగా ప్రయాణిస్తున్న కారు రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటన కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామ శివారులోని మెదక్- నర్సాపూర్ జాతీయ రహదారి హనుమాన్ బండల్ మలుపు వద్ద ఆదివారం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ నుంచి ఇరువురు వ్యక్తులతో వస్తున్న కారు హనుమాన్ బండల్ సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. దీంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా ఘటనకు సంబంధించి కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

టీవీఎస్‌ను ఢీకొన్న ఆటో

- సంఘటన స్థలంలో ఒకరు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి



సంగయ్య (ఫైల్)



మొగులయ్య (ఫైల్)

జోగిపేట(అందోల్): అందోల్ మండలం జోగిపేట డాకూర్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. జోగిపేట ఎస్ఐ సామ్యానాయక్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. టేక్మాల్ మండలం పాల్వంచ గ్రామానికి చెందిన ఏర్పుల సంగయ్య(50), భార్య భాగమ్మ, డాకూర్ గ్రామం చెందిన చెన్న మొల్ల మొగులయ్య(60) టీవీఎస్‌పై జోగిపేట నుంచి డాకూర్ వెళ్తున్నారు. ఇదే క్రమంలో డాకూర్ నుంచి అతివేగంగా వస్తున్న ఆటో వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో సంగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన మరో వ్యక్తి మొగులయ్యను జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భాగమ్మను జోగిపేట ప్రభుత్వాసుపత్రి తరలించారు. మృతుల బంధువు భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంబులెన్స్ ఆలస్యంగా రావడంతో..


డాకూర్- జోగిపేట రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు అలాగే రోడ్డుపై పడి ఉన్నారు. అటుగా వెళుతున్న వారు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణంలో 108 అంబులెన్సులు అందుబాటులో ఉంటాయి. అక్కడి నుంచి ప్రమాద స్థలానికి ఐదు నిమిషాల్లో చేరుకోవచ్చు. కానీ 108 వాహనం అందుబాటులో లేకుండా అల్లాదుర్గం నుంచి వస్తున్నట్లు 108 సిబ్బంది సమాచారం ఇవ్వడంతో సుమారుగా గంట వేచి చూడాల్సి వచ్చింది. వారు వచ్చే లోపు తీవ్ర రక్తస్రావం కావడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షి దళిత సంఘాల నాయకుడు దేవదాస్ ఈ విషయాన్ని వెల్లడించారు. 108 వాహనం త్వరగా వచ్చి ఉంటే ప్రాణాలు నిలిచేవని, అది రాకపోవడంతోనే ఇద్దరు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి భార్యకు తీవ్ర గాయాలు


నంగునూరు(సిద్దిపేట): మోటార్ సైకిల్ అదుపు తప్పి కల్వర్ట్‌ను ఢీ కొనడంతో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం గట్లమల్యాల మధిర గ్రామం సీతారాంపల్లిలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంక్షాపూర్‌కు చెందిన నమిలే నర్సింలుగౌడ్ (55), భార్య సత్తవ్వతో కలసి హుస్నాబాద్ మండలం గౌరవెల్లిలో జరిగిన విందుకు హాజరయ్యాడు. సాయంత్రం ఇంటికి వస్తున్న క్రమంలో మోపెడ్ కల్వర్టును ఢీ కొని కింద పడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇది చూసిన గ్రామస్తులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా నర్సింలుగౌడ్ అప్పటికే మృతి చెందగా సత్తవ్వ చికిత్స పొందుతోంది.

ఆటో-టీవీఎస్ మోపెడ్ ఢీ

తండ్రి, కుమారుడికి గాయాలు




గాయపడిన ఆగమయ్య



గాయపడిన కొన్యాల మల్లయ్య

కౌడిపల్లి(నర్సాపూర్): ఆటో- టీవీఎస్ మోపెడ్ ఢీకొనడంతో తండ్రి, కుమారుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కౌడిపల్లి మండలం తునికి చెరువు అలుగు మలుపు వద్ద ఆదివారం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తునికి గ్రామానికి చెందిన కొన్యాల మల్లయ్య అతడి కొడుకు ఆగమయ్య టీవీఎస్ మోపెడ్‌పై నర్సాపూర్ వెళ్తున్నారు. ఇదే క్రమంలో తునికి చెరువుకట్టపైన నల్లపోచమ్మదేవి ఆలయానికి వెళ్తున్న కూచన్‌పల్లికి చెందిన ఆటో, టీవీఎస్ మోపెడ్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో టీవీఎస్‌పైన ఉన్న కొన్యాల మల్లయ్య, ఆగమయ్య కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. ఈ విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య



లక్ష్మీ మృతదేహం

దుబ్బాక: జీవితం మీద విరక్తితో చెరువులో దూకి మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన దౌల్తాబాద్ మండలం దొమ్మట గ్రామంలో ఆదివారం జరిగింది. దౌల్తాబాద్ ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయిలపూర్ గ్రామానికి చెందిన చాకలి లక్ష్మీ (40) ఐదేళ్లుగా మానసికంగా బాధపడుతోంది. ఐదు రోజుల క్రితం తన తల్లి గ్రామమైన దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామానికి వచ్చింది. జీవితం మీద విరక్తితో బొమ్మల చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామ నిర్వహించి శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భర్త చాకలి లింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం



కాజల్ (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): ఉత్తర్ ప్రదేశ్‌రాష్ట్రానికి చెందిన భద్రు తన కుటుంబ సభ్యులతో బొంతపల్లి గ్రామంలో నివసిస్తున్నాడు. భద్రు చిన్న కుమార్తె కాజల్ ఓ ప్రైవేటు పరిశ్రమలో విధులు నిర్వహిస్తుంది. కాగా ఈనెల 14 నుంచి కాజల్ విధులకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో కాజల్ అక్క సల్మాన్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ బాలాజీ గోల్డ్. మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 9032040019. [T-08]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785739]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ కాల్ చేయండి. 7013029139, 9959617233 [M-1190673]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.